ప్రజాశక్తి
సోమవారం 23 జనవరి 2023
8 పేజీలు
విశాఖపట్నం   అనకాపల్లి

త్రాసు.. తిరకాసు

◆ విశాఖ నగరంలో పెరుగుతున్న తూకం మోసాలు
◆ అంతంతమాత్రంగానే అధికారుల తనిఖీలు



ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ) : విశాఖ నగరం.. 'తూకం' తప్పుతోంది. రోజురోజుకూ మోసాలు పెరుగుతున్నాయి. నగర వ్యాప్తంగా పండ్ల నుంచి కూరగాయల వరకు.. చికెన్, నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్, ఇలా ప్రతి వస్తువు విక్రయంలోనూ వినియోగదారుల కళ్లకు వ్యాపారులు గంతలు కడుతున్నారు. ఒకవైపు తూకాల్లో మోసాలు, మరోవైపు కల్తీతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ఒక కిలోకు 150 నుంచి 200 గ్రాముల వరకూ తగ్గించి అమ్ముతున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వ్యాపార కార్యకలాపాల్లో జరుగుతున్న త్రాసు తిరకాసుతో సాధారణ ప్రజలు ధగా పడుతున్నారు. మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ కాటాల (డిజిటల్ వేయింగ్ మిషన్లు)ను సైతం ఆధునిక సాంకేతికతతో ట్యాంపరింగ్ చేస్తుండటంతో, కళ్లకు తూకం బాగా కనిపిస్తున్నా.. వాస్తవంగా తగ్గుతోంది. డిజిటల్ వేయింగ్ మిషన్లలో కిలోకు 100 గ్రాముల వరకు దందా చేస్తున్నారు. దుకాణంలో ఒక వస్తువు కొనుగోలు చేసి, ఇంటికి వెళ్లి చూశాక పరిశీలిస్తే, తక్కువ తూకం ఉన్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. అంతేకాదు ప్యాకింగ్‌పై ఎక్కడా తయారీ తేదీ లేకుండానే విక్రయాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా, తూనికలు, కొలతల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పత్రికల్లో వార్తా కథనాలు వచ్చిన కొన్ని రోజులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి, ఆ తర్వాత చేతులు దులుపుకుంటున్నారు. వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకోవడం వల్లే అధికారులు సరిగా స్పందించడం లేదని జనం నుంచి విమర్శలు వస్తున్నాయి.

తనిఖీలకు సిబ్బంది కొరత

నగరంలో పెరిగిన దుకాణాలు, జనాభాకు తగ్గట్టు తూనికలు, కొలతల శాఖ సిబ్బంది నియామకం జరగడం లేదు. సిబ్బంది కొరతతో తనిఖీలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. డివిజన్‌కు ఒక్కరు చొప్పునే ఉండటంతో వారి పరిధిలోని ఈ మోసాలను అరికట్టడం తలకు మించిన భారంగా మారుతోంది. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు కొలతల్లో మిగతా 2లో..

విశాఖ నగరంలోని ఓ పరీక్షా కేంద్రానికి భారీగా తరలివచ్చిన అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతం

విశాఖలో 91.74, అనకాపల్లిలో 93.9 శాతం మంది హాజరు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కానిస్టేబుల్ అభ్యర్థుల ప్రిలిమినరీ రాత పరీక్ష విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించిన ఈ పరీక్షకు విశాఖ జిల్లాలో 54,772 మందికిగాను 50,248 మంది, అనకాపల్లి జిల్లాలో 9,827 మందికిగాను 9,297 మంది హాజరయ్యారు. విశాఖలో 91.74 శాతం, అనకాపల్లిలో 93.9 శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విశాఖ సిపి శ్రీకాంత్ పలు కేంద్రాలను పరిశీలించారు. (వార్తలు 8వ పేజీలో)

లోపలి పేజీల్లో..
గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు
సికింద్రాబాద్ - అగర్తల మధ్య ప్రత్యేక రైళ్లు
ఉక్కు పరిరక్షణకు నిర్వాసితుల దీక్ష
మనసు దోచిన మధుర గీతాలు

సిఐటియు జాతీయ కమిటీలో

నలుగురికి చోటు

ప్రజాశక్తి - విశాఖపట్నం

సిఐటియు జాతీయ కమిటీలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన నలుగురికి చోటు దక్కింది. ఈ నెల 18 నుంచి 22 వరకు బెంగళూరులో సంఘం జాతీయ మహాసభలు జరిగాయి. చివరి రోజు నూతన కమిటీని ఎన్నుకున్నారు. విశాఖ నుంచి కెఎం.శ్రీనివాసరావు వర్కింగ్ కమిటీ సభ్యులుగా, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి జనరల్ కౌన్సిల్ సభ్యులుగా, అనకాపల్లి జిల్లా నుంచి జి.కోటేశ్వరరావు జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు. మరో పక్క ఈ మహాసభల్లో 'ఉక్కు' నినాదం మార్మోగింది.

కెఎం.శ్రీనివాసరావు

ఆర్‌కెఎస్‌వి.కుమార్

పి.మణి

జి.కోటేశ్వరరావు

విద్యుత్ చౌర్యంపై నిరంతర నిఘా

◆ పౌర సేవల జాప్యంపైనా విచారణ
◆ 1912ను సద్వినియోగం చేసుకోవాలి
◆ 'ప్రజాశక్తి'తో ఇపిడిసిఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి, ఎఎస్‌పి ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులొచ్చినా, పౌర సేవలు సకాలంలో అందకపోయినా, సేవలకు డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసినా ఫిర్యాదులపై విచారణ చేపడతాం. విద్యుత్ చౌర్యం నియంత్రణకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. డిస్కాంలో సివిల్ వర్క్‌లు, మెటీరియల్‌లో నాణ్యత వంటివి లోపించినా పరిశీలిస్తాం. చర్యలకు సిఫార్సు చేస్తాం' - అని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఛీఫ్ విజిలెన్స్ అధికారి, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఎవిఎల్.ప్రసన్నకుమార్ అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ విభాగపు సేవలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

విద్యుత్ చౌర్యం నియంత్రణకు తీసుకున్న చర్యలేంటి ?

ఇపిడిసిఎల్ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి

పాల్పడకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఫిర్యాదులొచ్చినా, సమాచారమిచ్చినా, మీడియాలో వార్తలొచ్చినా వాటిపై స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసులు నమోదుచేస్తున్నాం. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారెంతటివారైనా, ఏ కేటగిరీ వినియోగదారుడైనా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

త్రాసు.. తిరకాసు

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు తనిఖీకి వచ్చినట్లు సమాచారం అందగానే మిగిలిన వ్యాపారులు దుకాణాలు మూసేస్తున్నారు. రెండు నెలల కిందట ఇదే విధంగా నగరంలోని పూర్ణా మార్కెట్ ప్రాంతంలో అధికారులు తనిఖీలకు వచ్చి ఓ దుకాణంలోకి వెళ్లగా సమాచారం అందుకున్న మిగతా వ్యాపారులు దుకాణాలు మూసేసి పత్తాలేకుండా వెళ్లడమే నిదర్శనం. చికెన్ ధరలు కూడా ఆయా ప్రాంతాల్లో వేర్వేరుగా ఉంటున్నాయి. కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు కొన్నిచోట్ల తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదేమని అంటే పేపర్ ధర అని అంటున్నారు. నిజానికి అటువంటిచోట్ల చికెన్ అమ్మకంలో కిలోకు వంద గ్రాముల వరకు తక్కువ ఉంటోంది. చేపలు, కూరగాయల అమ్మకాల్లో ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగించడం లేదు. ప్రధానంగా రోడ్లపైన, తోపుడుబండ్లపైన జరిగే అమ్మకాల్లో ఇది కనిపిస్తోంది. రైతు బజార్లలో మాత్రం ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను వినియోగిస్తున్నారు. అక్కడ కూడా తూకంలో తేడా ఉంటోంది. అయితే సీతమ్మధార రైతు బజారులో మాత్రం వినియోగదారులు కొనుగోలు చేసిన కూరగాయలను అక్కడ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంలో తూకం వేసుకొని, సరిచూసుకొనే అవకాశం ఉంది. తేడా వస్తే రైతు బజార్ ఎస్టేట్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. మిగిలిన రైతు బజార్లలో ఇటువంటి సదుపాయం లేదు.

ఎండియు వాహనాల్లో..

పౌర సరఫరాల శాఖ ద్వారా బియ్యం, కందిపప్పు, చక్కెర వంటి నిత్యావసర వస్తువులను రేషన్ కార్డుదారులకు ఇస్తున్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక డోర్ డెలివరీ పేరుతో ఎండియు వాహనాలను తెచ్చి, అందులోనే తూకం కాటాలను ఫిక్స్ చేసి సరఫరా చేస్తున్నారు. కానీ ఈ ఎండియు వాహనంలోనూ తూకంలో తేడాలు వస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. డీలర్లు సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఎలక్ట్రానిక్ కాటాలనే ఇటువంటి వాహనాలలో వినియోగిస్తున్నారు. ఈ కాటాల ద్వారా 10 కిలోల బియ్యం తీసుకుని బయట తూకం వేస్తే 9 కిలోలే ఉంటున్నాయి. ఎవరైనా రేషన్ కార్డుదారులు తూకంపై ప్రశ్నిస్తే తమకు బస్తాల్లోనే తూకం తక్కువగా వస్తోందని, తాము ఎవరికి చెప్పుకోవాలంటూ ఎదురు ప్రశ్న వేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీ, పెట్రోలు బంకుల్లో వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే వాహనంలోనూ ఎలక్ట్రికల్ కాటాలు ఉండాలి. వినియోగదారులు కోరితే తూకం వేసి చూపించాలి. కానీ ఎక్కడా అలా జరగడంలేదు. వాస్తవంగా సిలిండర్లను తూకం వేస్తే ఒక్కో దానిలో 2 నుంచి 3 కేజీల తక్కువగా ఉంటున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

ఇక పెట్రోలు బంకుల్లోనూ వ్యాపారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. లీటరుకు 100 నుంచి 200 మిల్లీలీటర్ల వరకూ తక్కువ ఉంటోంది. ఇంత జరుగుతున్నా వినియోగదారుల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలను తూనికలు, కొలతల శాఖ చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి ఎలక్ట్రికల్ కాటాల ట్యాంపరింగ్, కల్తీల నివారణకు విస్తృత తనిఖీలు చేపట్టాలని, తూకాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ చౌర్యంపై నిరంతర నిఘా

ఉపేక్షించేదిలేదు. చర్యలు తీసుకుంటాం.

వినియోగదారుల సమస్యలను మీకు తెలియజేయాలంటే ఎలా ?

విద్యుత్ వినియోగదారులు సరఫరాలో జరిగిన లోపాలు, సేవల్లో జాప్యం, సేవలకు డబ్బులు డిమాండ్ చేసిన ఉద్యోగుల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1912కు తెలియజేయొచ్చు. ఈ నెంబరుకు వచ్చిన ఫోన్‌కాల్స్ రికార్డు అవుతాయి. కార్యాలయ ఫోన్ నెంబరు 0891-2705477కు సమాచారమివ్వొచ్చు. లేదంటే cvo@apeasternpower.comకు ఈ - మెయిల్ ద్వారా తెలియజేసే అవకాశముంది. వినియోగదారులు వీటిలో దేని ద్వారా సమాచారమిచ్చినా విచారణ చేపడతాం.

గతేడాది ఎన్ని కేసులు నమోదుచేశారు ?

గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు విద్యుత్ చౌర్యానికి సంబంధించి 6,454 కేసులు నమోదుచేశాం. ఈ తరహా కేసులను 6,760 పరిష్కరించి రూ.68.83 లక్షలు అపరాధ రుసుము వసూలు చేశాం. 2021లో 5,802 కేసులు పరిష్కరించి రూ.66.41 లక్షలు, 2020లో 5,456 కేసులు పరిష్కరించి రూ.58.68 లక్షలు అపరాధ రుసుము వసూలు చేశాం. విద్యుత్‌శాఖ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి చర్యలకు ఇపిడిసిఎల్ సిఎమ్‌డికి సిఫార్సు చేస్తాం.

నిఘా వ్యవస్థ పనితీరు ఎలా ఉంది ?

నిఘా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. విద్యుత్ చౌర్యం, ఉద్యోగులపై ఆరోపణలు, సివిల్ వర్క్స్, మెటీరియల్‌లో నాణ్యతా లోపాలపై దృష్టిపెట్టి తనిఖీలు పెంచుతున్నాం. ఏపి ట్రాన్స్‌కో విజిలెన్స్ జెఎమ్‌డి మల్లారెడ్డి సూచనలు తీసుకుంటూ, విజిలెన్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ డిస్కాం సేవలు ప్రజలు వినియోగించుకొనేలా ప్రయత్నిస్తున్నాం. శాఖాపరమైన ప్రమాదాలపై కూడా విచారణ నిర్వహించి నివేదిక అందజేస్తాం.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు

స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ఎస్‌బిఐ అధికారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పరిసరాల పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యతని భారతీయ స్టేట్ బ్యాంకు అధికారులు తెలిపారు. ఎస్‌బిఐ పరిపాలనా కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్ మన్మయ పాండబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌కె.బీచ్‌లో 'స్వచ్ఛత పఖ్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీచ్ పొడవునా సాగిన ఈ ర్యాలీలో పర్యావరణ పరిరక్షణ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గతంలో తమ విశాఖ మాడ్యుల్ పరిధిలో ఉన్న మూడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు 25 వేల మొక్కలు నాటామని గుర్తు చేశారు. విశాఖ నగరం అత్యంత సుందరమైందని, ఈ నగరాన్ని అద్దం వలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ అధికారులు, పిఆర్ఓ రామమూర్తి నాయుడు, నగర పరిధిలోని బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన బ్యాంకు ఆఫ్ బరోడా విశాఖపట్నం రీజియన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో స్వచ్ఛతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి కమిషనర్ రాజాబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖను పర్యావరణ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ వైవిఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో భాగంగా బ్యాంకు ఆధ్వర్యాన ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఆర్‌కె.బీచ్ పరిసరాలలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ర్యాలీ సందర్భంగా నార, కాటన్ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఎం రవీంద్ర, చీఫ్ మేనేజర్లు, బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రాముఖ్యతను తెలియజేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారి

సికింద్రాబాద్ - అగర్తల మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ - అగర్తల - సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 07030 సికింద్రాబాద్ - అగర్తల ప్రత్యేక రైలు ఫిబ్రవరి 6 నుంచి 27 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 16.35 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 04.20 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 04.40 గంటలకు బయలుదేరి గురువారం 03.00 గంటలకు అగర్తల చేరుకుంటుంది. 07029 అగర్తల - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 10 నుండి మార్చి 3 వరకు ప్రతి శుక్రవారం ఉదయం 06.10 గంటలకు అగర్తలలో బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున 03.05 గంటలకు విశాఖపట్నం చేరుకుని 03.15 గంటలకు బయలుదేరి ఆదివారం సాయంత్రం 04.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఈ రైళ్లు గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, దంకుని, రాంపూర్ హాట్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, న్యూజల్ అలీపుర్‌దువార్, న్యూ బొంగైగావ్, కామాఖ్య, గౌహతి, న్యూ హాఫ్లాంగ్, బదర్‌పూర్, న్యూ కరీంగంజ్, ధర్మనగర్, అంబాసా స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయని అధికారులు తెలిపారు.

లోకేష్ పాదయాత్రకు అడ్డంకులెందుకు ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత, టిడిపికి లభిస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అక్కసుతో లోకేష్ పాదయాత్ర ప్రారంభం కాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ విమర్శించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ యువనేత లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడానికి సాధ్యంకాని షరతులు, నిబంధనలు విధిస్తున్నారని మండిపడ్డారు. పాదయాత్ర కోసం డిజిపి కోరిన వివరాలు హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో పాదయాత్రలు చేసిన వారికెవరికైనా, ఏ ప్రభుత్వాలైనా ఇన్ని నిబంధనలు, షరతులు విధించాయా ? అని ప్రశ్నించారు. నాటి టిడిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు ఎటువంటి అడ్డంకులూ సృష్టించలేదన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని పూర్ణా మార్కెట్ వద్ద ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో ఈ ఏడాది మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదివారం ఆలయంలో జరిగిన ఆలయ పాలకవర్గ సమావేశం నిర్ణయించింది. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 19న జరుగుతాయన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే ఈ ఉత్సవంలో అన్ని రకాల సౌకర్యాలూ కల్పించాలన్నారు. ఘటాల ఉత్సవం, ఊరేగింపు, శాఠీ ఉత్సవాలు జరుగుతాయన్నారు. శివరాత్రి రోజున ప్రత్యేక దర్శనం ధర రూ.50, సాధారణ దర్శనం ధర రూ.20గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులకు ఉచితంగా మంచినీరు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

మీనాక్షికి పిఎం రాష్ట్రీయ బాల పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నానికి చెందిన చెస్ క్రీడాకారిణి అలనా మీనాక్షికి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం దక్కింది. ఈ నెల 23వ తేదీన జరిగే కార్యక్రమంలో ఆమెకు భారత రాష్ట్రపతి ఈ అవార్డును అందజేస్తారు. 24న పిఎం మోడీ అవార్డు గ్రహీతలతో సంభాషిస్తారు. బాల పురస్కారానికి లక్ష రూపాయలు, పతకం, సర్టిఫికెట్, బహుమతి ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారాన్ని దక్కించుకున్న మీనాక్షికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ సభ్యులు కెవివి.శర్మ, భీమారావు, జ్వాలాముఖి, శ్రీకాంత్, మణికంఠ తదితరులు అభినందించారు.

పార్కులో షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజలకు మంచి చేయాలనే తపన ఉంటే ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేపడతారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మూడో జోన్ 20వ వార్డు పరిధిలోని లాసన్స్ బే కాలనీలో కార్పొరేటర్ నెక్కల్ల లక్ష్మి, సురేష్ దంపతుల ఆర్థిక సహాయంతో క్వాడంగల్ రెసిడెన్సీ అసోసియేషన్ పార్కులో నిర్మించిన రేకుల షెడ్డును ప్రారంభించారు. నిత్యం ప్రజల మధ్య ఉండి, వారి అవసరాలు తెలుసుకొని ఉపయోగపడే పనులు చేసిన నాయకులే నిజమైన నాయకులని తెలిపారు.

మరడ అప్పారావు రెడ్డికి నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరుకు చెందిన బిజెపి సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ మరడ అప్పారావురెడ్డి మరణం విశాఖ నగరానికి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అన్నారు. ఇటీవల మరణించిన అప్పారావురెడ్డి సంస్మరణ సభ ఆదివారం పెదవాల్తేరు జంక్షన్ గాంధీ సెంటర్‌లో జరిగింది.

IN THE HONOURABLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P. No. 4 / 2023

Between:
Kotyada Srinu, S/o. Ramu, Hindu, aged 31 years, R/at D.No. 26-04- 22/1, Velamapeta, Visakhapatnam-01 ...Petitioner
And:
Dogga Balaram & 9 Others ...Respondents

PUBLIC NOITCE

The Public is hereby informed that the above petitioner filed the above IP No. 4/2023 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge at Visakhapatnam on 05-01-2023 and the above matter stands posted to **02-03-2023** for Hearing. So Public is hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **02-03-2023** either in person or through an advocate at 10-30 A.M.

(By Order of the Hon'ble II Addl. Senior Civil Judge at Visakhapatnam)

M. NAGESWARA RAO
D.SANYASI NAIDU
Advocates, Visakhapatnam,
Cell: 9010293999
9948444780

Visakhapatnam
Dt. 21-01-2023

అరకొర సౌకర్యాలతో గ్రంథాలయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయం అరకొర సౌకర్యాలతో ఉండడంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఒకేసారి పదిమంది పాఠకులు వస్తే చాలని గది. లైబ్రేరియన్ ఉండే గదిలో కూడా ఆరేడుగురుకు మించి చదువుకునేందుకు వీలు లేని పరిస్థితి ఉంది.

అదనపు భవనం ఊసే లేదు

ప్రస్తుత శాఖా గ్రంథాలయ భవనానికి అదనంగా పైన అదనపు భవనం నిర్మిస్తామంటూ పురపాలక సంఘంగా ఉన్న కాలంలో ప్రతిపాదనలు చేశారు. వాస్తవానికి ఇక్కడి శాఖా గ్రంథాలయ నిర్వహణ మొత్తం జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోనిది. ఇక్కడి పాఠకుల అవసరాల దృష్ట్యా అప్పటి రాజ్యసభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి సహకారంతో రాజ్యసభ నిధులతో 2008లో సామాజిక భవనం పేరుతో ఇక్కడ గ్రంథాలయ భవనం నిర్మించారు. పాఠకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో ఉన్న సౌకర్యాలు చాలక సమస్యగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న భవనంపై అదనపు భవనం నిర్మించాలన్న ప్రతిపాదన ఎంతో కాలంగా ఉన్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు.

అందుబాటులో పుస్తకాలు

ఇక్కడి గ్రంథాలయంలో బోలెడన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలు, వైద్య గ్రంథాలు, మహనీయుల చరిత్రకు సంబంధించినవి ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీష్ దినపత్రికలు, వార, పక్ష పత్రికలు ఉన్నాయి.

భీమిలిలోని శాఖా గ్రంథాలయం

సౌకర్యాలు కల్పించాలి

ఇక్కడున్న గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలి. అదనపు భవనం నిర్మించాలి. ఇప్పుడున్న భవనాన్ని ఆధునీకరించాలి.

బి.శ్రీనివాస్
భీమిలి

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. తాగునీటి సదుపాయం కల్పించాలి.

పి.మధుసూదనరావు
భీమిలి

పొంచి ఉన్న ప్రమాదం

- విద్యుత్ లైన్ల కిందే వ్యాపారాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక నుంచి అడవివరం వైపు వెళ్లే బిఆర్‌టిఎస్ రోడ్డులో జివిఎంసి స్థలాలను ఆక్రమించుకొని పలువురు వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న షాపుల యాజమానులు కాలి బాటలను, కాలువలపై పలకలు వేసి వ్యాపారం లావాదేవీలు జరుపుకుంటున్నారు. సామాజిక అవసరాలకోసం ఖాళీగా ఉంచిన స్థలాలను ఆక్రమించుకొని వ్యాపారాలు సాగిస్తున్నా పట్టణ ప్రణాళిక, సచివాలయ సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. టిఫెన్ సెంటర్లు, ఫర్నీచర్, వెల్డింగ్ షాపులు చాలా వరకు విద్యుత్ లైన్ల కిందే ఉన్నాయి. వెల్డింగ్ పనులు చేయడంతో ఒక్కొక్కసారి ఇనుప రాడ్లు విద్యుత్ తీగలకు తగలడంతో అందులో పనిచేసే వర్కర్స్ ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన సంఘటనలూ ఉన్నాయి. ఇటీవల బిఆర్‌టిఎస్ రోడ్డు శ్రీకృష్ణాపురంలో ఒక వెల్డింగ్ షాపు ముందు పనిచేస్తున్న ఒక యువకుడు ఇనుప రాడ్డును పెకి ఎత్తే క్రమంలో హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఫుట్‌పాత్‌లను, కాలువలను ఆక్రమించిన వారిపై జివిఎంసి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : కలిగొట్ల స్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్‌ఎన్ మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన ప్రియాంక

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రియాంక ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : విజయవాడలోని ఇందిరాగాంధీ, నగరపాలక సంస్థ స్టేడియంలో ఇటీవల 21 ఏళ్ల లోపు బాలికల విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో స్థానిక కెజిబివి 10వ తరగతి విద్యార్థిని బి.ప్రియాంక ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ గంగాకుమారి తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని, పిఇటి లక్ష్మిని ప్రిన్సిపల్ అభినందించారు.

మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థినులు

మారథాన్‌లో కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఫ్లూయింట్ గ్రిడ్, వైజాగ్ ఆల్ట్రాఆధ్వర్యాన ఉమెన్స్ హై పెర్ఫార్మెన్స్ రన్స్ పేరిట నగరంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న మారథాన్‌లో స్థానిక కెజిబివి విద్యార్థినులు 50 మంది పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ గంగాకుమారి తెలిపారు. వీరికి సేవలందించేందుకు గాను వాలంటీర్లుగా మరో 50 మంది విద్యార్థినులు పాల్గొన్నారని పేర్కొన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం పెంపుదలకు ఈ తరహా పోటీలు ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచనల మేరకు తమ పాఠశాల విద్యార్థినులు పరుగు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

రోడ్డు మధ్యలో నీటి గుంత

పట్టించుకోని అధికార యంత్రాంగం

రోడ్డు మధ్యన ఏర్పడిన గుంత

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం- బోని రోడ్డులో చందక జంక్షన్ వద్ద రహదారి మధ్యలో ఏర్పడిన నీటి గుంత వల్ల వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ప్రతిరోజు రైతులు వేకువ జామున ఆటోలు, బైకులపై మార్కెట్‌కు కూరగాయలు తెస్తుంటారు. రాత్రి వేళల్లో ప్రయాణాలు సాగించేటప్పుడు ఈ గుంతను గమనించలేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు వేసేటప్పుడు ఈ ప్రాంతంలోని నీరు పోవడానికి కల్వర్టు ఏర్పాటు చేయకుండా వదిలి వేయడంతో నీటి నిల్వలు పెరిగి గుంతగా మారింది. ఈ రోడ్డు గుండా ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగము ప్రయాణిస్తున్నా చూచీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో చందక గ్రామస్తులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చి ఎగువ నుంచి వచ్చే నీరు పోవడానికి దారిచూపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమారుడు శివ నందీష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలను నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ అందజేశారు. చిల్డ్రన్స్ విలేజ్‌లో ఉన్న అనాథ పిల్లల నడుమ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి-మధురవాడ : గీత కార్మిక కుటుంబాలకు అన్యాయం చేయొద్దని, సిపిఐ అధికారుల వేధింపులు ఆపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్‌చేశారు. గీత కార్మికులకు అండగా సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, మధురవాడ గ్రామ సర్వే నెంబర్ 274/1లో 40 సెంట్లు జిరాయితీ భూమిని పాత మధురవాడకు చెందిన పేడ గీత కార్మికుల కుటుంబానికి చెందిన టేకోపూడి పెద్దఅప్పన్న, పీస పైడితల్లి తదితరులు అప్పటి మధురవాడ గ్రామ పెద్దలైన పోతిన సత్యనారాయణ మూర్తి, పిల్ల సత్యనారాయణ మూర్తి సమక్షంలో 1957 జులై 17వ తేదీన దస్తావేజు నెంబర్ 2020 కొనుగోలు చేసుకున్నారని తెలిపారు. 2001లో కుటుంబం అవసరాలు కోసం ఇందులో 20 సెంట్లు భూమిని ఐదుగురు వ్యక్తులకు విక్రయించారని చెప్పారు. ఈ ఐదుగురు ఆ స్థలాల్లో ఉడా, జీవీఎంసీ అనుమతులతో ఇళ్లు కట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. మిగిలిన 20 సెంట్లు స్థలంలో గీత కార్మికులు పాకలు, షెడ్లు నిర్మించుకొని ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం పోతిన రమణ దస్తావేజు నెంబర్ 3589 దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకొని కె.శివరామరాజు అనే వ్యక్తికి అమ్మారని, ఇది ఇది తెలిసిన రైతులు న్యాయస్థానంలోను, సిట్‌లోను ఫిర్యాదు చేశారని చెప్పారు. న్యాయస్థానం, సిట్ విచారణ చేసి ఈ భూమి రైతులకు చెందినదని తీర్పు

బాధితులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు

ఇచ్చినట్టు వివరించారు.

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు సిబిడి అధికారులతో బెదిరింపులకు పాల్పడుతూ ఏదోలా సెటిల్ చేసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరిస్తున్నారని తెలిపారు. సిబిడి అధికారులు అధికారపార్టీ నాయకులకు కొమ్ముకాయడం దుర్మార్గం అన్నారు. ఈ ఘటనలో సిబిడి అధికారులపై విశాఖ డిసిపికి శనివారం ఫిర్యాదు చేశారని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఐ అండగా ఉంటుందని పైడిరాజు తెలిపారు. ఈ నిరసనలో రైతులు కుటుంబాలతో పాటు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, ఎమ్‌డి.బేగం, వి.సత్యనారాయణ, కె.మేఘారావు, కె.కుమార్, మూగి సూర్యనారాయణ, నారాయణరావు, టి.సత్యనారాయణ, వి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 61వ వార్డులో మరిడిమాంబ కాకి అప్పన్న జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతర (పరస) సందర్భంగా మరిడిమాంబ అమ్మవారిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే గణబాబు దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే గణబాబుతో టిడిపి నాయకులు కాకి పోలిరెడ్డి, మజ్జి సోమేష్ తదితరులు ఉన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, కొల్లు నూకరెడ్డి, సిహెచ్.నూకరాజు, బుస అప్పలరెడ్డి, పిలక వర, మంగ పాల్గొన్నారు.

జాతరకు హాజరైన మేయర్ దంపతులను సన్మానించిన నిర్వాహకులు

ధర్నా చేస్తున్న రజక వృత్తిదారులు

మౌలిక సదుపాయాల కోసం రజకుల ధర్నా

ప్రజాశక్తి -కంచరపాలెం : దోబీఘాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ జివిఎంసి 56వ వార్డు పరిధి పైడిమాంబ కాలనీ వద్ద కె.లక్ష్మి ఆధ్వర్యాన రజకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో సుమారు 30 కుటుంబాలు రజక వృత్తి చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. రజకులు వృత్తి చేసుకునేందుకు దోబీ ఘాట్లు నిర్మించాలని, ఉచిత కరెంటు, షెడ్డు, మోటార్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. రజకుల లాండ్రీలకు జగనన్న చేదోడు పథకం వర్తింప చేయాలని, దోబీఘాట్లకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు ఇవ్వాలని, రజకుల వృత్తి స్థలాలను పిఒపిలో చేర్చి పూర్తి హక్కు కల్పించాలని, రజకులకు రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించే చేతి వృత్తిదారుల సదస్సులో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.ఉమ, ఆర్.వర్మ, కె.మంగ, పి.సింహాలక్ష్మి, కె.పెంటమ్మ, పరదేశిరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

మహా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి ములగాడ : విశాఖ ఉక్కు ప్రజా గర్జనకు సంబంధించిన పోస్టర్‌ను సింధియా జంక్షన్‌లో సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యాన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 30వ తేదీన ఉక్కు ప్రజా గర్జనకు కార్మికులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23, 24 తేదీలలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసుల వద్ద దీక్షలు, 25న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు లేకపోయినా, సొంత గనులు కేటాయించకపోయినా నిర్విఘ్నంగా స్టీల్‌ప్లాంట్ నడుస్తూ లక్షల మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.50 వేల కోట్లు పన్నులు, ఇతర డివిడెండ్లు రూపంలో చెల్లిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు కాంగ్రెగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, బోగవెల్లి హరినాథ్, డి.గోపాలరావు, టి.కామేశ్వరరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గాజువాక : జగనన్న ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేసింది. సిపిఐ పోరుబాట పోస్టర్‌ను ఆదివారం చైతన్యనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ, టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు కేటాయించాలని, జగనన్న ఇళ్ల స్థలాల్లో పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు కేటాయించాలని కోరారు. సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ జాప్యం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, కె.పోతన్న, సోమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి యాత కార్పొరేషన్ డైరెక్టర్‌గా రెండో సారి నియమించేందుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు డైరెక్టర్ బాడితబోయిన రాములప్పడు కృతజ్ఞతలు తెలిపారు. జివిఎంసి 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబుకు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నిర్వాసితుల దీక్ష

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపుమేరకు వడ్లపూడి నిర్వాసితకాలనీలో మీసేవ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వాసితులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేశించి టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. విశాఖ అభివృద్ధి ఉక్కు కర్మాగారం వల్లే జరిగిందని గుర్తించాలని కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

స్థానిక కార్పొరేటర్ బొండా జగన్నాథం మాట్లాడుతూ, 700 రోజులుగా నిర్వాసితులు, కార్మికులు పోరాటాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడంలేదన్నారు. స్థానిక అధికార పార్టీ నాయకులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 29వ తేదీన కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, భాస్కర్, కళ్లేపల్లి శ్రీనివాస్ వర్మ, డి.వి.అప్పారావు, దానయ్య, రాము, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.


నిర్వాసితుల దీక్షలను ప్రారంభిస్తున్న పల్లా శ్రీనివాసరావు

విసిసి ర్యాలీ

ప్రజాశక్తి- గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని కోరుతూ విసిసి ఆధ్వర్యాన ఆదివారం జోగవానిపాలెంలో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ అంటూ బ్యానర్లు పట్టుకొని ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.సంతోషం పాల్గొన్నారు.

దేశపాత్రునిపాలెంలో దీక్ష

ప్రజాశక్తి - పరవాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని మండలంలోని 79వ వార్డు దేశపాత్రునిపాలెం మెయిన్‌రోడ్డు పక్కనే అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 12 గంటల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నేత ఎన్.రామారావు, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, ఎఐటియుసి నాయకులు కె.సత్యనారాయణ, బి వెంకటరావు, టిఎన్‌టియుసి నేత పి రామ్మోహన్‌కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థ, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రంలోని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తూ సహించబోమని హెచ్చరించారు. దశలవారీ ఆందోళనను తీవ్రతరం చేసి, కేంద్రప్రభుత్వం మెడలు వంచి తీరుతామని స్పష్టం చేశారు. ఈ నెల 30న ఉక్కునగరంలోభారీ బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.మాణిక్యం, పీడీ.నాయడు, ఎస్..శివరాధాక్రిష్ణ, బి.భాషారావు, బి.పరమేశ్వరి, నమ్మి రమణ, రామారావు, అప్పారావు, కె రాజుబాబు, గరికిన రమేష్ కుమార్ పాల్గొన్నారు

దీక్షలో పాల్గొన్న అఖిలపక్ష నేతలు, మాట్లాడుతున్న రామారావు

గవరుల సంక్షేమానికి కృషి : బుద్ద శివాజీ

ప్రజాశక్తి - కంచరపాలెం: గవరుల సంక్షేమానికి కృషి చేస్తానని కేంద్ర గౌరీ సంక్షేమ సేవా సంఘం నూతన అధ్యక్షులు బుద్ద శివాజీ అన్నారు. సంఘం కొత్త అధ్యక్షులుగా నియమితులైన బుద్ద శివాజీ, కార్యవర్గ సభ్యులు ఆదివారం తాటిచెట్ల పాలెం, రైల్వే న్యూ కాలనీలోని కేంద్ర గౌరీ సేవా సంఘం భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గవరలంతా సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. 18ఏళ్ల తన సర్వీసులో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానని, కరోనా సమయంలోనూ పేదలకు అండగా ఉన్నానని గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి సాధించుకోవాల్సిన అంశాలపైనా త్వరలో సభ్యులతో కలిసి చర్చిస్తామన్నారు. ఎపిలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే గౌరీ సంఘం తరపున వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా ఆడారి లచ్చిప్పారావు, ఉపాధ్యక్షులుగా మొల్లేటి కుమార్, వేగి సత్యనారాయణ, బొడ్డేడ అప్పారావు, మల్ల బలరాం, పెంటకోట సంజీవరావు నాయుడు, కోశాధికారిగా కొణతాల శ్రీను, సహాయ కార్యదర్శులుగా కాండ్రేగుల మహాలక్ష్మినాయుడు, మల్ల రవికుమార్, సదరం పురుషోత్తం, ఆడారి పారుపల్లి రవి, శరగడం సత్యనారాయణ, ఆడిటర్‌గా మల్ల రాంప్రసాద్ తదితరులు శివాజీతో పాటు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కేంద్ర గౌరీ సేవా సంఘం పాత కార్యవర్గ సభ్యులను నూతన కార్యవర్గ సభ్యులు సత్కరించి వారి సేవలను కొనియాడి జ్ఞాపికలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గవర కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న కేంద్ర గౌరీ సంక్షేమ సేవా సంఘం కార్యవర్గం

హేతువాద ఉద్యమ చరిత్రలో వెంకటాద్రి ఓ మైలురాయి

ప్రజాశక్తి - కంచరపాలెం, కలెక్టరేట్: హేతువాద ఉద్యమ చరిత్రలో రావిపూడి వెంకటాద్రి ఓ మైలురాయని భారత నాస్తిక సమాజం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, వై.నూకరాజు తెలిపారు. హేతువాద సంఘం అధ్యక్షుడు రావిపూడి వెంకటాద్రి మృతికి సంతాపం తెలియజేశారు. ప్రముఖ రచయిత హేతువాది త్రిపురనేని రామస్వామి శిష్యులైన రావిపూడి భారతదేశంలోని హేతువాద ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. బహుగ్రంథ రచయిత అయిన రావిపూడి 1999లో విశాఖలో జరిగిన భారత నాస్తిక సమాజం మహాసభలలో పాల్గొన్నారని తెలిపారు. 1982 నుంచి హేతువాదం మాసపత్రిక సంపాదకులుగా ఉన్నారని, పెరియార్ - రామస్వామి, అన్నాదురైలతో పలు సభలు నిర్వహించారని పేర్కొన్నారు. 1991లో ఇంకొల్లులో రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ స్థాపించారని తెలిపారు. ఆయన మృతి హేతువాద ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం శంకరమఠం రోడ్డులో ఉన్న పద్మశాలి భవనంలో ఘనంగా నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా కొప్పల రమేష్, అధ్యక్షులుగా వానపల్లి ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూరిశెట్టి సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా వానపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పెంటపల్లి సత్యనారాయణ, పప్పు శ్రీనివాసరావు, నీలి రవి, కోశాధికారిగా నామాల అనేష్ కుమార్, మహిళా విభాగ అధ్యక్షురాలిగా గాయత్రి ఫణికుమారి, యువత అధ్యక్షులుగా కొండపల్లి సతీష్, గౌరవ సలహాదారులుగా కులపాక సన్యాసిరావు, కరణం వెంకటేశ్వరరావు, చిక్కా సత్యనారాయణ, రాపర్తి సుబ్బారావు, కల్లూరి రామూర్తి ప్రమాణ స్వీకారం చేశారు.

విశాఖ జిల్లాలో పద్మశాలి కులస్తులకు అన్ని రాజకీయ పార్టీల్లో సముచిత స్థానం కల్పించాలని, పద్మశాలి సంఘం సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన రాజకీయ ప్రముఖులకు సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కనీసం ఐదు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని కోరారు. చేనేత వృత్తి పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని, ఆర్థికంగా వెనుకబడిన పద్మశాలి కులస్తులను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, ఆప్కోస్ ఛైర్మన్ చిల్లపల్లి మోహనరావు, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి, జివిఎంసి కో ఆప్షన్ సభ్యులు కె.ప్రభావతి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, నెడ్ క్యాప్ ఛైర్మన్, కెకె రాజు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

భోజన కార్మికులపై ప్రభుత్వ వైఖరి దుర్మార్గం

ప్రజాశక్తి- అనకాపల్లి : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తిస్తోందని ఆ పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు నాగమణి, రెహానా, మహాలక్ష్మి, సుధ విమర్శించారు. ఆల్ ఇండియా సిఐటియు మహాసభల నేపథ్యంలో వారు మాట్లాడుతూ కొత్త మెనూ అమలు చేయాలని ఒత్తిడి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం, సరిపడా కార్మికులు, వంట పాత్రలు, మెస్ ఛార్జీలు పెంచకుండా రకరకాల వంటలు వండి పెట్టమనడం దుర్మార్గమన్నారు.

మాట్లాడుతున్న వరలక్ష్మి తదితరులు

ఉదయం పదిన్నర గంటలకు విద్యార్థుల సంఖ్య చెప్పి, కేవలం రెండుగంటల్లోనే వండిపెట్టమనడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వంటల తయారీ, వండే విధానంపై గుచ్చిగుచ్చి ఆరా తీస్తూ, రకరకాలుగా కార్మికులను వేధించడం ద్వారా ఈ పథకం నుంచి దూరమయ్యేలా పొమ్మనలేక పొగబెడుతోందని దుయ్యబట్టారు. పథకాన్ని తాము నిర్వహించలేమంటూ కార్మికులే స్వయంగా చెప్పే పరిస్థితులను ఉత్పన్నం చేసి, అక్షయపాత్రకు అంటగట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ దీనిపై దృష్టి పెట్టి, భోజన సమస్యలను పరిష్కరించాలని, అలాగే వేతనాలు, మెస్‌ఛార్జీలను పెంచి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

84వ రోజుకు నాబ్ నిర్వాసితుల దీక్షలు

దీక్షల్లో పాల్గొన్న నాబ్ నిర్వాసితులు

ప్రజాశక్తి - రాంబిల్లి : సమస్యల పరిష్కారానికి మండలంలోని నరసాపురం నేవీ మెయిన్ గేట్ ముందు నాబ్ నిర్వాసితుల ఆందోళన ఆదివారం నాటికి 84వ రోజుకు చేరుకుంది. ఎనిమిది గ్రామాల ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు.

అసంపూర్తిగానే ముగిసిన చర్చలు

నాబ్ నిర్వాసితుల జెఎసి, ఎనిమిది గ్రామాల పెద్దలతో శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశం అసంపూర్తిగానే ముగిసింది. ఆర్‌డిఒ చిన్నికృష్ణ, ఫిషరీస్ జెడి లక్ష్మణ్, ఎస్‌డిసి ఎలమంచిలి జ్ఞానవేణి, సెజ్ జనరల్ మేనేజర్ తదితర అధికారులతో జెఎసి నేతలు చర్చించారు. అర్హులకు పెండింగ్ ప్యాకేజీలు, జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ కల్పనకు అధికారులు హామీ ఇచ్చినప్పటికీ, తాత్కాలిక ఉద్యోగాలు కాకుండా ఎటిసి, ఆసియన్ పెయింట్స్, లారెస్ వంటి కంపెనీల్లో శాశ్వత ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపట్టాలని జెఎసి నేతలు సూచించారు. ప్రతి కుటుంబ యజమానికి, మేజర్ సన్స్‌కు జెట్టి నిర్మాణంలో శాశ్వత ఉపాధి కల్పించాలని అంతవరకు నెలసరి జీవనభృతి కింద ఒక్కొక్కరికి రూ.14,300 చొప్పున ఇవ్వాలని, లేకుంటే 60 నెలలకుగాను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద నెలకు రూ.14,300 చొప్పున రూ8.50లక్షలు ఒకే సారి చెల్లించాలని కోరారు. ప్రతిబోటు యజమానికి రూ.నాలుగు లక్షలు ఇవ్వాలని కోరగా, అధికారులు రూ.2.50 ఇచ్చేందుక సమ్మతించారు. నిర్వాసితుల ఆందోళనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తుదిరూపం కల్పిస్తామని, తీసుకున్న నిర్ణయాన్ని రెండు రోజుల్లో తెలియపరుస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో అసంపూర్తిగానే చర్చలు ముగిసాయి.

ముత్యాల సతీష్‌కు ఘన సత్కారం

ముత్యాల సతీష్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్రలోనే పేరుగాంచిన వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా గౌరీ పరమేశ్వరులను ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల స్టేజిలను సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఎం వి ఆర్ యువసేన పాల్గొన్నారు.

జగన్ పాలనలో జీతాలకు అవస్థలు

టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి సక్రమంగా జీతభత్యాలు అందేలా చట్టం తీసుకురావాలని రాష్ట్ర గవర్నరుకు రాష్ట్ర ఉద్యోగుల సంఘం నివేదించడాన్ని బట్టి ఉద్యోగుల పట్ల రాష్ట్రప్రభుత్వం ఎంత అమానుషంగా ప్రవర్తిస్తుందో తేటతెల్లమౌతోందని అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు మండిపడ్డారు.. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ వేతనాల విషయమై గవర్నర్‌కు ఉద్యోగులు వెళ్లి మొరపెట్టుకోవడం ఎక్కడా లేదని, దేశచరిత్రలోనే ఇది ప్రథమమన్నారు.

ఎన్నికలకు ముందు తాము ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా సకాలంలో వేతనాలు, ఇతర భత్యాలు చెల్లిస్తామని నమ్మబలికిన సిఎం జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన నాలుగేళ్లలో వారికి చుక్కలు చూపిస్తున్నారన్నారు. దీనిపై ప్రశ్నించిన ఉద్యోగులను రెండు వర్గాలుగా విడగొట్టి, వారి జీవితాలతో చెలగాటమాడు తోందన్నారు.

మాట్లాడుతున్న నాగ జగదీష్

విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన ప్రావిడెంట్ ఫండ్, సరెండర్ లీవు, జిఐఎస్ వంటి ఖాతాల సొమ్ము రూ.22 వేల కోట్లను దారి మళ్లించారని విమర్శించారు. ప్రశ్నించిన ఉద్యోగులను వేధించే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్న నేపథ్యంలో వారి వినతి మేరకు గవర్నర్ చొరవ చూపి, ఉద్యోగులు పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, పార్లమెంటరీ అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు పాల్గొన్నారు.

నల్లబెల్లంపై నిషేధం ఎత్తేస్తాం

ఇదేం ఖర్మ రాష్ట్రానికిలో మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి-కశింకోట : మంత్రి గుడివాడ అమర్నాథ్ తీరు వల్లే అనకాపల్లి నియోజకవర్గంలోని చెరుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు.ఆదవారం రాత్రి మండలంలో వెదురుపర్తి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే నల్ల బెల్లం నిషేధం ఎత్తివేతను పక్కాగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు .చెరకు రైతుల కష్టాలు మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు తెలియడం లేదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అనకాపల్లి బెల్లం కాదని, పక్క రాష్ట్రాల బెల్లం వ్యాపారులతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కుమ్మక్కైయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉగ్గిణ రమణ మూర్తి, వేగి గోపికిష్ణ పెంటకోట రాము, సిద్దిరెడ్డి శ్రీను, కొక్కల రమణ, మాజీ ఎంపీటీసీ ఆళ్ల అప్పలనర్సమ్మ, గోపి, బండి రామరావు, రమణ, ఎంపీటీసీ కొంతం రాము, సిద్ది రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

తెలుగు యువత నేత డాక్టర్ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

ఆసుపత్రి సిబ్బందికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-.అనకాపల్లి : తెలుగు యువత నేత, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ తనయుడు డాక్టర్ పీలా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి బిసి సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, పోలవరపు త్రినాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

275 మందికి ఉచిత కంటి పరీక్షలు

చిన్నారులకు కంటి అద్దాలిస్తున్న బ్రాండిక్స్ దొరస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా ఆఫరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 99వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 275 మంది కంటి రోగులను వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు.బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా నిర్వహించిన శిబిరంలో 15మంది చిన్నారులతోపాటు 300మంది రోగులు రాగా, విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పరీక్షలు నిర్వహిచారు వీరిలో 202మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. 19మందికి అంతర కుసుమాల ఆపరేషన్ అవసరమని సూచించారు. మిగిలిన వారికి టోకెన్లను అందించారు. ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణను బ్రాండిక్స్ ఇండియా పార్ట్నర్ దొరస్వామి పర్యవేక్షించారు. కంటిరోగులతో మాట్లాడి, వారికి తగు సూచనలు చేశారు. కంటి సమస్యలున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు, కంటి అద్దాలు ఇస్తామని భరోసా నిచ్చారు.శిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు మంచినీరు, మజ్జిగ, భోజన సదుపాయం కల్పించారు.

1 నుంచి దేవీ తల్లి తీర్థం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రంలోని ఉమా మహేశ్వరి దేవితల్లి తీర్థ మహోత్సవాన్ని ఫిబ్రవరి ఒకటి నుంచి ఐదు రోజులు పాటు నిర్వహించాలని ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆదివారం దేవితల్లి ఆలయంలో సమావేశమైన మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు అధ్యక్షతన సమావేశమైన ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థం, కల్యాణోత్సవాల నిర్వహణపై చర్చించారు. సమావేశంలో గ్రామ పెద్దలు వరదపురెడ్డి లలితా నాయుడు, యేల్లేటి కరుణాకర్ నాయుడు, వరదపురెడ్డి సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, ఆలయ ధర్మకర్త లలితాప్రసాద్. వేచలపు అప్పలనాయుడు, కె.వి రమణ, సోమిరెడ్డి పేరు నాయుడు, వాలేటి నాగరాజు పాల్గొన్నారు.

ప్రైవేటు ఫ్యాక్టరీకి చెరుకు తరలింపు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలోని రాజాం కేంద్రంగా ప్రైవేటు సుగర్ ఫ్యాక్టరీలకు చెరుకు రవాణా ముమ్మరంగా సాగుతోంది. నీలకంఠాపురం, తైపురం తురకలపూడి, సీతయ్యపేట పెద్దపూడి, ఆర్. శివరాంపురం, ఆర్. భీమవరం, మల్లం, బుచ్చయ్యపేట, కందిపూడి, పెద్దమదిన, తదితర గ్రామాల నుండి రైతులు పాలకొండ దరి సంకిలి ప్రైవేట్ చక్కర కర్మాగారానికి నిత్యం వందలాది టన్నుల చెరుకును రవాణా చేస్తున్నారు. రాజాం జంక్షన్‌లోని తూనిక కేంద్రాల వద్దకు ట్రాక్టర్లు, నాటు బళ్లపై చెరకును తీసుకువచ్చి రైతులు అందజేసు న్నారు. చెరకు టన్ను ఒక్కంటికి రూ.2300 చొప్పున చెల్లిస్తుండడంతో, రైతులు ప్రైవేట్ సుగర్ ఫ్యాక్టరీకే చెరకు సరఫరాకు ఆసక్తి కనబరుస్తున్నారు. రైతుల పొలాల నుంచి చెరకును నేరుగాకాటా వద్దకు తరలిస్తున్నారు తూనిక కేంద్రాల వద్ద ప్రైవేట్ ఫ్యాక్టరీకి చెందిన ఏజెంట్లు తూకం వేసిన అనంతరం లారీలపై పాలకొండ చక్కెర కర్మాగారానికి తరలిపోతుంది.

ప్రైవేట్ ఫ్యాక్టరీలకు తరలింపునకు సిద్ధం చేస్తున్న చెరుకు

పేదలకు వస్త్రాల పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు తొమ్మిదవ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంస్థ కార్యదర్శి సత్యనారాయణ, నీలేష్ గుప్తా, అల్లాడ శ్రీనివాసరావు, ఆర్ మల్లేశ్వరరావు, ఆర్ చంద్రరావు, పట్నాల కష్ణమోహన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కొండకర్లలో కలుసుకున్నారు. పరస్పరం క్షేమ సమాచారాలు తెలుసుకున్న వారంతా, గత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుని రోజంతా ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు రూ.ఐదువేలు ఆర్థికసాయం అందించారు. ఇచ్ఛా ఫౌండేషన్ నిర్వాహకులకు రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను సమకూర్చారు. ఈ సందర్భంగా ఒకరి కష్టసుఖాల్లో మరొకరు భాగస్వాములం కావాలని నిర్ణయించుకున్నారు.కార్యక్రమంలో డి.ప్రసాద్, జి.అప్పారావు, వి.అనిల్, టింకు, ఎన్ రమణ, పి చిన్నారావు, కె బాబ్జి, ఆర్ సన్యాసినాయుడు, జి శ్రీను, కె.సాహితి, డి భవాని, షేక్ సైనాజీ, పి రమణమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి

ప్రజాశక్తి-దేవరాపల్లి : గ్రామీణ ప్రాంతాలలో గ్రామదేవతలు, పేరంటాలమ్మల తీర్థాల జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. కనుమ రోజున ప్రారంభమైన తీర్థాల సందడి, పలు గ్రామాలలో కోలాహలంగా సాగుతున్నాయి. ఆదివారం మండలంలోని కొత్తపెంట గ్రామంలో పైడిమాంబ తీర్థం వైభవంగా నిర్వహించారు. తీర్థాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. విజేతలకు భారీగా నగదు బహుమతులను అందజేశారు. సీతంపేట గ్రామంలో మరిడిమాంబ తీర్థం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సాహంగా పోటీలు

కబడ్డీ ఆడుతున్న మహిళలు

ప్రజాశక్తి- రాంబిల్లి : లాలం ఎరుకునాయుడు తీర్థం సందర్భంగా లాలం భవానీభాస్కర్, లాలం చందు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మహిళల కబడ్డీ పోటీలను నిర్వహించారు. జిల్లా నుంచి ఆరు బృందాల మహిళల కబడ్డీ జట్లు ఈపోటీల్లో పాల్గొన్నాయి. ఉత్సాహంగా సాగిన ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా వచ్చారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామం గవరపేటలో సీతారామాంజనేయ తీర్థం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీ ప్రదర్శనను గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు జండా ఊపి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మహిళల కోలాటాలు నిర్వహించారు. రాత్రి విశాఖ వారిచే డాన్స్ బేబీ డాన్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో చోడవరం సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు. వార్డు సభ్యుడు తనకల అప్పలనాయుడు. మల్ల వెంకటరమణ, శరగడం భూలోక నాయుడు, గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎడ్ల బళ్ల పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఎరుకునాయుడు

ఘనంగా మంత్రి అమర్ జన్మదిన వేడుకలు

రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటి, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం



మంత్రి అమర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతులు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన కార్పొరేటర్లు జాజుల ప్రసన్న లక్ష్మి, మందపాటి సునీత, డాక్టర్ జి రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిలో బాలింతలకు చిన్నపిల్లల కిట్లు పంపిణీ చేశారు. ముందుగా నూకంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేతలు కొణతాల మురళీకష్ణ, జాజుల రమేష్, పొలమరశెట్టి మురళి, పెతకంశెట్టి జగన్మోహన్, నడిశెట్టి మధు, సకల గోవిందు, ఆడారి శ్రీనివాసరావు, కడిమిశెట్టి సతీష్, గొన్నబత్తుల వెంకటరమణ, కోన ఉమా, ఏవీ రత్నకుమారి, మరిపల్లి శోభ, గంట సముద్రాలు, డొంక సత్తిబాబు పాల్గొన్నారు.

తుమ్మపాలలో...: తుమ్మపాల మేజర్ పంచాయతీ కార్యాలయంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు అధ్యక్షతన మంత్రి అమర్నాథ్ జన్మదిన వేడుకలు జరిగాయి. వైస్ ఎంపిపివిల్లూరి సూర్య కుమారి శేఖర్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ, ఎంపీటీసీ సభ్యులు కన్నారావు,

కశింకోటలో రక్తదాన శిబిరం

పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వైస్ ప్రెసిడెంట్ మొగసాల లక్ష్మీ వెంకట్, సీనియర్ న్యాయవాది పిళ్ల హర శ్రీనివాసరావు, పడాల గణపతి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యాలయంలో...

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలక యశోద రవి ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో అమర్నాథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి ఉపాధ్యక్షుడు కారక సోమనాయుడు, డైరెక్టర్లు నీటిపల్లి లక్ష్మి, శోభ, శ్యామల, నూకరత్నం, తులసి, లక్ష్మి, అచ్చిరాజు, అప్పలరాజు, నాగ సంతోష్, దాడి కుమార్ పాల్గొన్నారు

అచ్యుతాపురం : మంత్రి అమర్ జన్మదినం సందర్భంగా మింథిలోని ఆయన ఇంటికి వెళ్లిన వైసిపి నేతలు ద్వారపురెడ్డి బాబ్జి, ఎంపిటిసి ఈతా బాబురావు, పిన్నమ్మరాజు రవీంద్ర, అడిగర్ల దేముడు తదితరులు గజమాల, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గాజువాక : మంత్రి అమర్‌నాథ్ స్వగ్రామమైన మిందిలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజువాక నియోజకవర్గంలో ఉన్న పార్టీ సభ్యులు, కార్పొరేటర్లతో పాటు, అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరై భారీ పూలమాలలతో సన్మానించారు. దారి పొడవునా పెద్దపెద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు. మింది గ్రామమంతా భారీ కటౌట్లు వెలిశాయి. పార్టీ క్యాడర్ అంతా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కశింకోట : త్యేగాడ గ్రామంలో మంత్రి అమరనాథ్ జన్మదిన వేడుకల సందర్భంగా నీటి పల్లి దివాకర్ యూత్ ఆధ్వర్యంలో విశాఖపట్నం రోటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతోనిర్వహించిన రక్తదానశిబిరాన్ని ఎంపిపి కలగా లక్ష్మి మండల ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి, నమ్మి మీన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, కశింకోట సర్పంచ్ జయరజని, నీటిపల్లి లక్ష్మి శ్యామ్‌సన్ పాల్గొన్నారు బయ్యవరం పంచాయతీలో 15 మంది పారిశుధ్య కార్మికులకు వైసిపి మండల అధ్యక్షుడు గొల్లివిల్లి శ్రీనివాసరావు చీరలు, బట్టలు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో కేక్ కట్ చేశారు. మండల

మార్కెట్ యార్డులో పేదలకు దుస్తుల పంపిణీ

ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, రాజమండ్రి సాయి అన్నదానానికి రూ.వెయ్యి వితరణ చేశారు.

ఆరిలోవ : విశాఖ తూర్పు నియోజకవర్గ వైసిపి నాయకులు ఆదివారం మంత్రి అమర్‌నాథ్ నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర డైరెక్టర్ పేర్ల విజయచందర్, తూర్పు నియోజకవర్గం ఎస్‌సి సెల్ ఇన్‌ఛార్జి గూడపాటి విక్టర్, ఎన్‌హెచ్‌ఆర్‌పి జాతీయ ఎస్సీసెల్ ఇన్‌ఛార్జి పారిపల్లి రామారావు ఉన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు అమర్‌నాథ్ ఇంటికి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు మింది వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

కోటవురట్ల:రాష్ట్రమంత్రి అమర్నాథ్ జన్మదిన వేడుకలను కైలాసపట్నం గ్రామంలో జెడ్‌పిటిసి ఉమాదేవి స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సిద్ధబత్తుల సత్యనారాయణ, కొడవటిపూడి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి కుమార్ రాజా, వంతర నాగేశ్వరరావు, డివి యువసేన అధ్యక్షులు చామంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటవురట్లలో కేకు కట్ చేస్తున్న జెడ్‌పిటిసి ఉమాదేవి

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి: గిరిజన గ్రామ ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎల్లవేళలా అధికారులను సన్నద్ధం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మంత్రి బూడి ముత్యానాయుడు అన్నారు. మండలంలోని గరిసింగి శివారు గ్రామాలు కొత్తూరు, డోర్ర చెరువు, కించుమండ గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ముందుగా గరిసింగి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, జెడ్‌పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, సర్పంచ్ గుడెపు రాము, ఎంపిటిసి కోలా వెంకటరమణ (గోపి) ఎంపిడిఒ సిహెచ్ సుబ్బలక్ష్మి, ఎంఇఒ సిహెచ్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

కమ్ముకున్న మంచు దుప్పటి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట/ వడ్డాది : మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం తెల్లవారుజామున నాలుగుగంటల నుండి దట్టమైన పొగ మంచు అలుముకొని పంటపొలాలు రోడ్లు పొగ మంచుతో నిండిపోయాయి. కొద్దిపాటి దూరంలో వున్న వస్తువులు సైతం కనిపించనంతగా మంచుముసుగు వేయడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. మండలంలోని బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, దిబ్బిడి, చిన్నఅప్పన్న పాలెం, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో పొగ మంచు దెబ్బకు ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు వరకు వాహనదారులు ఇబ్బందులు పట్టారు. రైతులు, పాల ఉత్పత్తిదారులు, ప్రజలు ముసుగులేసుకుని కార్యకలాపాలను నిర్వహించారు.

బంగారుమెట్టలో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం, జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగాయి. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఈగల శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నమ్మి శ్రీనివాసరావు, వియ్యపు నాగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా టి విజయ్ ఆనంద్, సుక్కు శ్రీనివాసరావు, పరిశీలకులుగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా టివెంకటరమణ(సిపిఒ కార్యాలయం), కార్యదర్శిగా మైలపల్లి శివ(రెవెన్యూ కలెక్టర్ ఆఫీస్), సహాధ్యక్షులుగా కె.ఎర్రాజీరావ్(పంచాయితీరాజ్), కోశాధికారిగా బి సాయి(గ్రామీణ నీటి సరఫరా), ఉపాధ్యక్షులుగా కె.నాగేశ్వరరావు(వ్యవసాయశాఖ), కె శ్రీనివాసరావు(పౌరసరఫరాలు), జాయింట్ సెక్రటరీగా సిహెచ్ జ్యోతి(కలెక్టరేట్ రెవెన్యూ), సి నాగేశ్వరరావు(ఆర్అండ్ బి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి సతీష్(జిల్లా పంచాయతీ కార్యాలయం) ఎన్నికయ్యారు.

ప్రతి సోమవారం అర్చకుల సమస్యలపై 'స్పందన'

ప్రజాశక్తి- దేవరాపల్లి : జిల్లాలో వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా దేవాదాయ శాఖ అధికారి బుద్ధ మహాలక్ష్మి గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనకాపల్లి నూకాంబిక దేవస్థానం ప్రాంగణంలోని జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో ఈ స్పందన జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆరోగ్యశ్రీ కార్డు పొందడానికి, ఉద్యోగుల జీతాలు, సర్వీస్ సంబంధిత సమస్యలను ఈ స్పందనలో పరిష్కరిస్తామన్నారు.

శాశ్వత చెరుకు కాటా ఏర్పాటు చేయరూ..

- కష్టంగా చెరుకు తరలింపు - సాగుపై రైతుల అనాసక్తి

ప్రజాశక్తి-కొత్తకోట:చెరకు రైతుల సౌకర్యార్థం టి.అర్జాపురం - దొండపూడి గ్రామాల మధ్య చక్కర ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో శాశ్వత చెరకు కాటా ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది సీజన్లో చెరకు సేకరణ నిమిత్తం రావికమతం మండలం దొండపూడి సమీపంలో మోదమాంబ ధర్మకాట వద్ద తాత్కాలిక చెరుకు సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చొరవతో గత డిసెంబర్ నెల 25న ప్రారంభించిన ఈ తాత్కాలిక చెరకు కాటా దొండపూడి, కిత్తంపేట, టి.అర్జాపురం,కొత్తూరు, పి.పొన్నవోలు, మత్యవానిపాలెం తదితర గ్రామాల చెరుకు రైతులకు తాత్కాలికంగా ఉపయోగ పడుతుంది. ఈ ప్రాంతంలో శాశ్వత చెరకు కాటాను ఏర్పాటు చేయాలని సభ్య చెరకు రైతులు గత్రెడ్డి వెంకటరావు, వడ్డాది శ్రీను, రాజాన తాతలు, కర్రి అప్పారావు చక్కర కర్మాగారం అధికారులను కోరుతున్నారు.

రావికమతం సమీపంలో చెరకు కాటా లేక చోడవరం చక్కర కర్మాగారానికి చెరకు తరలింపునకు రవాణా పరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఈ సమస్యల కారణంగానే చెరుకు పంటపై స్థానిక సభ్య రైతులు అనాసక్తి చూపుతున్నారని, కర్మాగారం అధికారులు చొరవ తీసుకొని చెరుకు రైతుల సౌకర్యార్థం అర్జాపురం లేక దొండపూడి గ్రామాల మధ్యలో శాశ్వతంగా చెరకు కాటాను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాత్కాలిక చెరుకు కాటా నుంచి తరలిస్తున్న రైతులు

ఈ విషయమై చక్కర కర్మాగారం సిడిఓ కె.రామం, ఫీల్డ్ ఆఫీసర్ పులగాయల సత్యనారాయణలను వివరణ కోరగా చెరకు రైతుల సౌకర్యం కోసం కర్మాగారం అధికారుల సూచినల మేరకు ప్రయివేట్ ధర్మ కాటా వద్ద సేకరణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రం ద్వారా సీజనల్గా సభ్య రైతుల నుంచి సుమారు 2 వేల టన్నులు చెరకు సేకరణకు ప్రణాళిక చేశామని అయితే ఇప్పటికే కేవలం 20 రోజులలో సుమారు 11 వందల టన్నులు చెరకు సేకరణ చేశామని చెప్పారు. రైతుల విజ్ఞప్తి మేరకు శాశ్వత కాటా ఏర్పాటుకు అధికారులకు సిపార్సు చేస్తామని వారు పేర్కొన్నారు.

పైలాను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలయ నిర్మాణానికి పైలా విరాళం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని చినగోగాడలో అభయాంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు రూ.50 వేల విరాళం ప్రకటించారు. విరాళం ప్రకటించిన పైలాకు గ్రామ పెద్దలు, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ సభ్యులు అద్దేపల్లి చిన్న అప్పారావు, బలిజి కుమార్, ఏ.రామారావు, పడాల అప్పలనాయుడు, పడాల కన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో పూజలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మాఘమాసం సందర్భంగా ఆదివారం ఉపమాక దుర్గాభవానీ పీఠంలో గురుభవానీ దవరసింగి రాంబాబు పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూర్య నమస్కారాలు, సూర్య ఆరాధనతో చక్కని ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ నెల 26న వసంత పంచమి, 28న రథ సప్తమి వేడుకల్లో పిల్లలను భాగస్వామ్యం చేయాలన్నారు.

నేడు కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి-చీడికాడ: జబర్దస్త్ బుల్లి తెరలో అద్భుత నటన అందించి పలువురి మన్ననలు పొందిన డూప్స్ కళాకారులకు మంత్రి బూడి ముత్యాలనాయుడు ఘనసత్కారం చేస్తున్నట్లు వైసిపి నాయకులు పాటూరి రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని మంచాల గ్రామంలో ఈనెల 23న సోమవారం జరిగే తీర్థ మహొత్సవం సందర్భంగా కళాకారులకు బూడి సత్కారం చేయనున్నట్లు తెలిపారు.

దెబ్బతిన్న కారు ముందు భాగం

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.విశాఖపట్నం నుండి విజయవాడ వెళ్తున్న కారు నక్కపల్లి వద్దకు వచ్చేసరికి బైక్ అడ్డంగా రావడంతో డ్రైవర్ అప్రమత్తమై కారును స్లో చేశాడు. దీంతో అదే మార్గంలో వెనుక నుండి వస్తున్న మరో కారు ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు..

పవన్పై ఎమ్మెల్యే వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వ్యాఖ్యలను జనసైనికులు ఖండించారు. ఆదివారం సాయంత్రం అడ్డురోడ్డులో జనసైనికులు మీడియా సమావేశం నిర్వహించారు. తిమ్మాపురం జనసైనికుడు గుర్రం ధన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ రాజకీయాలకు అనర్హుడంటూ వ్యాఖ్యానించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవికి పదహారు నెలలు జైలు శిక్ష అనుభవించిన వ్యక్తి అర్హుడా అంటూ ఎద్దేవా చేశారు. వైసిపిలో పాపులర్ కావాలనుకునే ప్రతి ఒక్కరూ పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఎమ్మెల్యేకు టిక్కెట్టు ఇచ్చే పరిస్థితి లేక పోవడంతో పవన్ పై వ్యాఖ్యలు చేయడంతో అధిష్టానం మెప్పు పొందాలను కోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్. బత్తుల రామకృష్ణ, బోయిన రాజు, పాలపర్తి రవికుమార్, వంగలపూడి చంద్రశేఖర్, బల్లంకి రాజు పాల్గొన్నారు.

అసోసియేషన్ సభ్యులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:పాలకొల్లు నుండి లంబసింగి పర్యాటక ప్రాంతానికి సందర్శనలో భాగంగా నర్సీపట్నం వచ్చిన యూత్ హాస్టల్ అసోసియేషన్ సభ్యులకు స్థానిక ఆర్య వైశ్య సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. స్థానిక వ్యాపారవేత్త వెలగ నారాయణరావు, శ్రీరామ ఐరన్ షాపు చినబాబు, వాసవి క్లబ్ సభ్యులు వీరికి స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు పార్కు, ధారమఠం, వలసంపేట, చాపరాతి తదితర ప్రాంతాల్లో సుందర ప్రదేశాల వివరాలు తెలియజేయడంతో యూత్ హాస్టల్ అసోసియేషన్ సభ్యులు ఆయా ప్రాంతాలకు తరలి వెళ్లారు.

పర్యావరణ పుస్తకాన్ని ఇస్తున్న సభ్యులు

మాట్లాడుతున్న వైసిపి నేతలు

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో టిడిపి నాయకులు తమ ప్రభుత్వంపై దుష్ ప్రచారం చేయడం తగదని వైసిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు వాసు తెలిపారు. స్థానిక విలేకర్లతో వారు ఆదివారం మాట్లాడుతూ, తమ ఎమ్మెల్యే పై టిడిపి నాయకుల విమర్శలు అర్థ రహితమన్నారు. టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో నిరుపేదలకు పథకాలు అందకుండా చేశారని గుర్తు చేశారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతి పేద కుటుంబానికి నేరుగా పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. తమ ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణ చేస్తే ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భద్రాచలం, సర్పంచ్ గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల పూర్వ విద్యార్థుల సందడి

నక్కపల్లిలో మాస్టార్లను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1976-77లో పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ 45 సంవత్సరాల విరామం అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన నక్కపల్లి పాఠశాల వేదిక గా ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను, చేదు అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి, ఆడిన ఆటలు, గురువులు బోధించే తీరు అన్నీ ఒకసారి నెమరు వేసుకుంటూ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బ్యాచ్కు చెందిన వారిలో అత్యధిక మంది విశ్రాంత ఉద్యోగులే. వారంతా ఏ రంగాల్లో స్థిరపడ్డారు, పిల్లల చదువులు, ఉద్యోగాలు తదితర విషయాలు తెలియజేశారు. ఒకరికొకరు అండగా నిలవాలని, ప్రతి ఏడాది ఇలా కలవాలని నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. తమకు విద్య నేర్పిన ఎ.రంగసాయి మాష్టారు, కార్యాలయ సిబ్బంది కె.ప్రకాశరావులతో పాటు కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తెలుగు ఉపాధ్యాయులు ఎన్వీఎస్ ఆచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డివి రామారావు, ఎన్.గోపాలాచార్యులు, నరిశే వెంకటాద్రి, పోలసానపల్లి నూకయ్యశెట్టి, రావు గోపాలకృష్ణ, మంచాల రమణ, అల్లు సత్యనారాయణ, శ్రీధరాల నాగేశ్వరరావు, పచ్చిపులుసు హనుమంతరావు, అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: రాచపల్లి కామేశ్వర గుడి వద్ద హైస్కూల్ 1987 బ్యాచ్కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆదివారం వారందరూ కలిశారు. ఆనాటి రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఆర్థికంగా సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేషాచలం, రమణ, అనిత పాల్గొన్నారు.

ఒకే చోట కలిసిన పూర్వ విద్యార్థులు

నగదు, సరుకుల వితరణ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: తిమ్మాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సేనాపతి బాబూరావు మాష్టారు నేతృత్వంలో జన సైనికులు పెద గుమ్ములూరు గ్రామానికి చెందిన పోల వరపు లోవరాజు కుటుంబానికి అండగా నిలిచారు. లోవరాజుకు కొన్ని రోజులుగా కాళ్ళు చచ్చు బడిపోయాయి. దీంతో కుటుంబాన్ని పోషించే దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసైనికులు పది వేల నగదు, సరుకులను అందించారు.

సహాయం చేస్తున్న నేతలు

సిఎం మెప్పు కోసం.. ఎమ్మెల్యే గణేష్ ఆరాటం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సీఎం జగన్మోహన్‌రెడ్డి మెప్పు పొందేందుకు ఎమ్మెల్యే గణేష్ ఆరాట పడుతున్నారని నర్సీపట్నం టీడీపీ నాయకులు నేతల నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడను పదే పదే విమర్శిస్తే రానున్న ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని పగటి కలలు కంటున్నారన్నారు. సీఎం జగన్ దగ్గర మార్కులు కొట్టేందుకే ఎమ్మెల్యే అయ్యన్నను ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అయ్యన్నపాత్రుడుపై ఎన్ని కేసులు పెట్టుకున్నా బెదరకుండా తన గళాన్ని వినిపిస్తున్నారని చెప్పారు. ఇకనైనా అయ్యన్నపై విమర్శలు మాని నియోజకవర్గ సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు.

'సైకోలా ఎమ్మెల్యే'

మాకవరపాలెం:వచ్చే ఎన్నికల్లో సీటు రాదని తెలిసి నర్సీపట్నం ఎమ్మెల్యే సైకోలా ప్రవర్తిస్తున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రాపాత్రుడు విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు ఉదయం లేవగానే అయ్యన్నపాత్రుని తలచు కోకుంటే ఎమ్మెల్యేకు నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడుని తిట్టడం తప్ప గ్రామాలను అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు.వైద్య కళాశాల నిర్మాణానికి వైసీపీ నాయకులు భూమిని ఇవ్వకపోతే టిడిపి నాయకులు ముందుకు వచ్చి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రామనాయుడు, మాజీ జెడ్పిటిసి శేషు కుమార్, మాజీ వైస్ ఎంపీపీ గోవింద,. సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోటలో తాగునీటి కుళాయి కోసం తవ్విన కాలువలు ప్రమాద కరంగా మారాయి. ఆదివారం గాంధీ నగర్ వీధిలో కోర్ని రాజు ఇంటికి సమీపంలో తవ్వి వదిలిన కాలువ గొయ్యిలో గ్రామానికి చెందిన వృద్దురాలు ప్రమాదవ శాత్తు పడిపోవడంతో కాలు విరిగి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వృద్దురాలిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన వృద్ధురాలు

ఇదిలా ఉండగా కుళాయి పైపులు ఏర్పాటుకు తవ్విన కాలువ గోతులు ఎప్పటికప్పుడు పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - రావికమతం:ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా మహిళలు, రైతాంగం అవగాహన పెంచుకోవాలని పిఆర్‌పి నిర్మల సూచించారు. మండలంలో గర్నికం గ్రామంలో ఆదివారం డ్వాక్రా సంఘాలు, రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రసాయనక ఎరువులు వాడకంతో అనేక రోగాలకు ప్రజలు గురవుతున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పండిన పంటలను తినడంతో అనారోగ్యం బారిన పడమన్నారు.ఈ కార్యక్రమంలో వివోఏ లక్ష్మి పాల్గొన్నారు.

హాజరైన డ్వాక్రా సంఘాల మహిళలు

పలుచోట్ల కానిస్టేబుల్ రాత పరీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం) : కానిస్టేబుల్ అభ్యర్థుల ప్రిలిమినరీ రాత పరీక్ష విశాఖ జిల్లాలో ప్రశాంతంగా సాగింది. నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. విశాఖ రీజియన్‌లో 104 పరీక్షా కేంద్రాల్లో రాత పరీక్ష చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష నిర్వహించారు. పురుషులు 41,434 మంది, మహిళలు 13,338 మంది మొత్తం 54,772 మంది అభ్యర్థులు ప్రిలిమినరీ రాత పరీక్షకు దరఖాస్తు చేసుకోగా పురుషులు 38,279 మంది, మహిళలు 11,969 మంది మొత్తం 50,248 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 91.74 శాతం హాజరు నమోదైంది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదన్న నిబంధన ఉన్నప్పటికీ కొన్ని పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులను అనుమతించి వారికి ఇబ్బందులు కలగకుండా పోలీసులు సహకరించారు. కొన్ని పరీక్షా కేంద్రాలను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పరిశీలించారు. సబ్ డివిజన్‌లోని పరీక్షా ఏర్పాట్లును డిసిపి-1 సునీల్ సుమిత్ గరుడ్, జి.నాగన్న, డిసిపి-2 కె.ఆనందరెడ్డి, ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్‌కె.రాజు పర్యవేక్షించారు.

అనకాపల్లిల్లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

అనకాపల్లి జిల్లాలో 93.9శాతం హాజరు

21కేంద్రాల్లో 9,297 మంది పరీక్షకు హాజరు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో ఆదివారం జరిగిన పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రాథమిక పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 21 కేంద్రాల్లో 9,827 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 9,297మంది పరీక్షలు రాశారని జిల్లా ఎస్‌పి గౌతమిశాలి వెల్లడించారు. అనకాపల్లి పట్టణంలో 11 కేంద్రాలు, చోడవరంలో ఐదు, మునగపాకలో రెండు, అచ్యుతాపురంలో రెండు, మాకవరపాలెంలో ఒకటి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 530 మంది అభ్యర్థులు గైర్హాజరుతో 93.9 శాతం మంది హాజరైనట్టు ఎస్‌పి గౌతమిశాలి తెలిపారు.

పరీక్షలను పర్యవేక్షించిన ఎస్‌పి గౌతమిశాలి

అనకాపల్లిలో ఆదివారం జరిగిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రాథమిక పరీక్ష కేంద్రాలను ఎస్‌పి గౌతమి సాలి పర్యవేక్షించారు. పట్టణంలో దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, భాష్యం, డివిఆర్, హిమశేఖర్, సంయుక్త, సర్వేపల్లి, శ్రీచైతన్య, కెవిఎన్‌ఆర్‌ఎం, శ్రీ కన్య జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలకు హాజరైన అభ్యర్థుల హాల్ టికెట్లను, గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాతే కేంద్రంలోని అనుమతించారు. ఎపిఎస్‌ఎల్‌ఆర్‌బి నిబంధనల ప్రకారం పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు, పోలీస్ అధికారులకు సూచించారు.పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థుల సీటింగ్, ఇతర సౌకర్యాలను సమీక్షించారు.

చోడవరం : పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షకు చోడవరంలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1810 మంది అభ్యర్థులకుగాను 1699 మంది పరీక్షలు రాశారు. 111మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద స్థానిక సిఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు కల్పించారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా తగు సూచనలు చేసేందుకు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఆలస్యంగా వచ్చిన వారిని, అడ్రసు తెలియని వారిని పోలీసులే బైకులపై స్వయంగా తీసుకెళ్లి పరీక్ష కేంద్రాల వద్ద దింపారు. పోలీసుల చర్యలపై కానిస్టేబుల్ పరీక్షలకు వచ్చే అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.

మాకవరపాలెంలో పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

చోడవరంలో అభ్యర్థిని బైక్‌పై తీసుకెళుతున్న హోంగార్డు

మాకవరపాలెం:మండలంలో తామరం అవంతి కాలేజీలో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1483 మంది అభ్యర్థులకుగాను 1317 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద భారీ బందోబస్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

మనసు దోచిన మధుర గీతాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ శివ సాయి సంగీత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విఎం.గోపాలరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పిఠాపురం కాలనీలోగల కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. గాయకులు బంగార్రాజు, మహ్మద్‌ఖాన్, బొమ్మిడి సత్యనారాయణ, జాస్మిన్, లక్ష్మీ సాత్విక, సావిత్రమ్మ, శ్వేత, వాసంతి, రాము, మహాదేవ్ మూర్తి, సునీత, లక్ష్మీనారాయణ, పి.శ్యామ్ సుందర్, కందర్ప రాధ తదితరులు ప్రజాధరణ పొందిన గీతాలను ఆలపించారు. కీ బోర్డుపై సోమేశ్, రాంబాబు, తబలాపై ఎవి.చలం, అప్పలరాజు, ఫాడ్స్‌పై నాని, జాజ్‌పై పైడిరాజు, ఫ్లూట్‌తో సతీష్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో విశాఖ సంగీత కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, గీత్ సంగీత్ అధ్యక్షులు ఎమ్‌డి.ఖాన్, ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, నాంచారయ్య, ఆశా మధు తదితరులు పాల్గొన్నారు.

గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

భూ కబ్జాపై నిరసన

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ భూకబ్జాల పర్వం ఒక్కొక్కటిగా బయట పడుతుండటంతో స్థానిక రెవిన్యూ అధికారులే నోరెళ్ల బెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.గత పది రోజుల కిందట ఇదే మండలంలో తట్టబంద శివారు పొర్లు పాలెం గ్రామ శ్మశాన వాటిక కబ్జా చేయడంతో పాటు కొండ గెడ్డలు, వాగులు, గిరిజనుల భూములకు సాగు నీరు అందించే చెక్ డామ్ లు, డీ ఫారం భూములు కలపి మరో 30 ఎకరాల భూములను రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జాకు పాల్పిడిందన్న ఆరోపణలు మరువక ముందే మరో కబ్జా పర్వం వెలుగు చూసింది. మండలంలో బాధనపాడు రెవెన్యూ పరిధిలో ఈ మధ్యనే కొత్తగా వేసిన మరో వెంచర్ పక్కన ఒకే కుటుంబానికి చెందిన సుమారు ఎనిమిది ఎకరాల భూములను కబ్జాకు పాల్పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ సంఘటనా స్థలంలోనే టెంట్ వేసి బాధిత కుటుంబం ఆదివారం నిరసన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు పిల్లా నూకరాజు, సర్వేశ్వరరావు తదితర కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా తాపేశ్వరంకు చెందిన తమ తండ్రి పిల్లా అచ్చారావు బాధన పాడు రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 40 (ప్రస్తుతం సర్వే నెం 54)లో సుమారు 24 ఎకరాలను తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం లింగరాజుపేటకు చెందిన దానబోయిన నాగరాజు నుంచి (10 ఎకరాలతో సహా)1967లో (డాక్ మెంట్ నెం 2527) కొనుగోలు చేసారని వివరించారు. పట్టా నెంబర్ 80గా 1996 లో నమోదు అయినప్పటి నుంచి తమ సాగులోనే ఉందన్నారు. పక్కనే రియల్ ఎస్టేట్ సంస్థకు తమ భూములలో సుమారు 14 ఎకరాలను తామే విక్రయం చేశామని..మరో రెండు ఎకరాలు భూమిని మరో రైతుకు విక్రయించామని బాధితులు చెప్పారు. మిగిలిన ఎనిమిది ఎకరాల భూమి తమ తండ్రి అచ్చారావు పేరునే ఉందని, అయితే ఆ భూమిని కూడా తామే కొనుగోలు చేస్తామని నమ్మించిన సంస్థ ప్రతినిధులు ఎగ్రిమెంట్ ప్రకారం అందులో సుగంధ చెట్లు నాటారని కాలం గడుస్తున్న భూములు కొనుగోలు వ్యవహారం తీర్చ కుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కారించాలని స్థానిక తహసీల్దార్ దృష్టిలో పెట్టడం తో పాటు జిల్లా కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశామని బాధితులు చెప్పారు. పలుకుబడి ఉపయోగించి తమ భూమిని కబ్జా చేసారని తమకు ఇవ్వాల్సిన సొమ్ము చెల్లించకుండా తమ వద్ద ఉన్న భూమి రికార్డులు సరైనవి కావు అంటూ...భూములతో సంబంధం లేని రైతుల పేర్లు చూపించి కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూముల వద్దకు వస్తే చంపేస్తా మంటూ బెదిరిస్తూన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు న్యాయం చేయాలనీ కోరుతూ తమ భూముల వద్దనే కుటుంబంతో సహా వంటా వార్పు తో నిరసన చేపట్టి నట్టు బాధితులు నూకరాజు, సర్వేశ్వ ర రావు కుటుంబం స్పష్టం చేశారు. తగిన భద్రత కల్పించాలని రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సమస్య పై తహసీల్దార్ మహేశ్వరరావు ను వివరణ కోరగా...ఈ సివిల్ సమస్య పై ఇప్పటికే ఇరువ ర్గాలతో సమావేశం నిర్వహించామని, భూమి ఎలా ధఖలు పడిందో లింక్ డాక్ మెంట్ తీసుకు రావాలని ఇరు వర్గాలకు చెప్పామన్నారు. ఇంత వరకూ రాలేదని పేర్కొన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు.

నిరసన చేపడుతున్న బాధితులు